సాక్షి చిత్తూరు
సోమవారం । 30 । డిసెంబర్ । 2024



పోస్టు కొట్టు.. లాఠీ పట్టు

కానిస్టేబుల్ పోస్టులకు దేహదారుఢ్య పరీక్షలు నేటినుంచి నిర్వహించేందుకు పోలీసు శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. - 8లో



ఈ రైళ్లు.. రెండు నెలలు రద్దు

తిరుపతి– కాట్పాడి మార్గంలోని ప్యాసింజర్ రైళ్లను రెండు నెలలపాటు రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. - 8లో



కిక్కిరిసిన బోయకొండ

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. - 8లో

న్యూస్‌రీల్

హద్దు మీరిన 'వేడుక'లపై కఠిన చర్యలు

చిత్తూరు అర్బన్: 'న్యూ ఇయర్ వేడుకలు ప్రతీ ఒక్కరూ చేసుకోవచ్చు. సెలబ్రేషన్స్‌కు మేము దానికి వ్యతిరేకంకాదు. కానీ ఓ పద్ధతి ఉంటుంది. త్రిబుల్ రైడింగ్, మద్యం తాగి స్నేక్ డ్రైవింగ్, ఈవ్ టీజింగ్ చేస్తే ఒప్పుకునేదిలేదు. ఆ రోజు తప్పించుకున్నా.. మరుసటి రోజైనా వాళ్లపై చట్టరీత్యా చర్యలు తప్పవు. పక్కవాళ్లకు ఇబ్బంది కలిగించకుండా, రోడ్లపై విచ్చలవిడిగా ప్రవర్తించకుండా న్యూ ఇయర్ చేసుకుంటే మంచిది. రెండు రోజుల పాటు 24 గంటలు మా వాళ్లు డ్రంక్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తారు.'' అని చిత్తూరు ఎస్పీ మణికంఠ హెచ్చరించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

పోలీసు కార్యాలయంలో రద్దు

చిత్తూరు అర్బన్: నగరంలోని ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

రూ.1.30 కోట్లు వసూలు

చిత్తూరు కార్పొరేషన్: ఆదివారం సెలవురోజు అయినప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాలను అందుబాటులో ఉంచారు. మొత్తం 28వేల మంది వినియోగదారులు బిల్లులు చెల్లించారు. తద్వారా రూ.1.30 కోట్లు వసూలైనట్లు ఎస్ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల : తిరుమల క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయి. శనివారం అర్ధరాత్రి వరకు 78,414 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,100 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి హుండీ ద్వారా రూ.3.45 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

బంగారుపాళ్యంకు చెందిన రంగనాథం(పేరుమార్చాం) దగ్గు, ఆయాసం అధికం కావడంతో కుటుంబీకులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. కండీషన్ బాగాలేదని డాక్టర్లు అడ్మిట్ చేయించారు. ఈ క్రమంలో ఆక్సిజన్ మాస్క్ లేదని చీటీ రాసి ఇచ్చారు. దీంతో వారు ఆస్పత్రి ఆవరణలో ఉన్న మెడికల్ షాపునకు వెళ్లి రూ.250 చెల్లించి ఆ మాస్క్ కొనుక్కొచ్చారు. ఆ తర్వాత ఆక్సిజన్ పెట్టారు. ఇలా కొన్ని రకాల మందులు, మాత్రలు బయటకు రాయించారు.

ఏడేళ్ల బాలికకు చర్మ సంబంధిత సమస్యలు ఉన్నాయి. జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లిన ఆ బాలికకు రెండు రకాల మాత్రలు రాయిచ్చారు. అందులో ఒక మాత్ర ఆస్పత్రిలోనే ఇచ్చారు. చర్మానికి రుద్దే జెల్, మరో మాత్ర బయట తీసుకోమన్నారు. దీంతో ఆ బాలిక తండ్రి బయట మెడికల్ షాపులో రూ.175 చెల్లించి ఆ జెల్‌ను కొనుగోలు చేశారు.

ఇలా ఒకటి రెండు కాదు.. వందలాది మంది రోగులు మందులు, మాత్రల కొనుగోలుకు బయట షాపులకే పరుగులు తీస్తున్నారు. కూటమి సర్కారు ప్రభుత్వ ఆస్పత్రులపై చిన్నచూపు చూస్తోంది. ప్రజారోగ్యాన్ని నిర్వీర్యం చేస్తోంది. వైద్య సేవలను గాలికొదిలేసింది. ప్రధానంగా మందులు, మాత్రల సరఫరా విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఆస్పత్రుల్లో మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. తద్వారా పలురకాలైనా మాత్రలు బయట మెడికల్ షాపుల్లోనే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. రోగుల మీద ఆర్థికభారం పెరిగిపోతోంది. ఈ సమస్యల నడుమ పేదలు ప్రభుత్వ ఆస్పత్రుల వైద్య సేవలు దూరమవుతున్నాయి.



మాత్రల వెతలు

- ప్రభుత్వ ఆస్పత్రులను వేధిస్తున్న మందుల కొరత
- వచ్చిన అరకొర మందులు వచ్చినట్టే మాయం
- పట్టించుకోని పాలక, అధికార యంత్రాంగం
- పేద రోగులకు ప్రైవేటు మెడికల్ షాపులే దిక్కు
- అందని ద్రాక్షగా సర్కారు వైద్యం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో ఒక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, 4 ఏరియా ఆస్పత్రులు, 8 సీహెచ్‌సీలు, 15 అర్బన్‌హెల్త్ సెంటర్లు, 50 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో నిత్యం 10వేలకుపైగా ఓపీ దాటుతోంది. ఇన్‌పేషెంట్‌లు 400 నుంచి 500 మంది వరకు ఉంటున్నారు. ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు, విష జ్వరాలు, కీళ్లనొప్పి సమస్యలు, చర్మం, చెవి, కంటి, ముక్కు సంబంధిత సమస్యలు అధికంగా వస్తున్నాయి. మూర్ఛ, మానసిక జబ్బులు, క్యాన్సర్, గర్భస్థ సమస్యలతో ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూకడుతున్నారు. వీరికి వైద్యులు పరీక్షించి కొన్ని రకాల మందులు, మాత్రలు రాయిస్తున్నారు. అందులో కొన్ని రకాల మందులు మాత్రమే ఆస్పత్రుల్లో ఇస్తుండగా, చాలా వరకు బయటకు రాయిచ్చే మందులు, మాత్రలు అధికంగా ఉందని రోగులు వాపోతున్నారు. వీటిని కొనేందుకు డబ్బులేక అవస్థలు పడుతున్నారు.

గతంలో మందులు, మాత్రలు ఫుల్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేసింది. ప్రధానంగా ఆరోగ్య శ్రీలో వేలాది రోగాలను చేర్చింది. రూ.25 లక్షల వరకు చికిత్స తీసుకునేలా చర్యలు చేపట్టింది. మందులు, మాత్రల కొరతకు ఢోకా లేకుండా చూసింది. ఆ కొరత ఏర్పడితే వెంటనే ఆరోగ్య శ్రీ నగదు ద్వారా కొనుగోలు చేసేలా ఆదేశాలిచ్చింది. ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి కావాల్సినన్ని మందులు, మాత్రలు ఇచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంది. దీనికి తోడు ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు చేసి వైద్య సేవలు అందించింది. కొన్ని విలువైన మందులు, మాత్రలను పోస్టల్ ద్వారా ఇంటికే సరఫరా చేయించింది. ఇక జగనన్న సురక్ష ద్వారా ఇళ్ల వద్దకే వెళ్లి రక్తపరీక్షలు చేసేవారు. క్యాంపులు ఏర్పాటు చేసి కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందించేవారు. ఫ్యామిలీ ఫిజిషియన్ పేరుతో పేదలకు, మంచం బాట పట్టిన వారికి ఆరోగ్య భరోసా కల్పించింది.



ఇప్పుడు ఇలా..



గత ప్రభుత్వ హయాంలో ఆస్పత్రికి వచ్చే రోగులందరికీ మెరుగైన వైద్య సేవలతోపాటు, నెలకు సరిపడా మందులు ఒకేసారి అందించేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆస్పత్రుల్లో మందుల కొరత వేధిస్తోంది. జిల్లా ఆస్పత్రితో పాటు ఇతర ఆస్పత్రుల్లో మందుల కోసం అడిగితే తిరుపతి నుంచే రావడం లేదని, ఇండెంట్ పెట్టామని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో వైద్యంతోపాటు అవసరమైన మందులన్నీ ఒకేసారి ఇచ్చేవారు. ఇప్పుడు అన్ని రకాల మందులు తక్కువగా ఉండడంతో వారం రోజులకు మాత్రమే ఇస్తున్నారు. ఇందులో కూడా కొన్ని రకాల మందులు స్టాక్ లేదంటున్నారు. ఈ మందుల కోసం మళ్లీ మళ్లీ ఆస్పత్రులకు రాలేక, దూర ప్రాంత రోగులు ప్రైవేట్ మందుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. గతంలో జిల్లా, ఏరియా, సీహెచ్‌సీ ఆస్పత్రుల్లో గతంలో మొత్తం 2వేల రకాల మందులు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు అన్నీ కలిపి వెయ్యి రకాలు కూడా లేవని తెలుస్తోంది. ఆస్పత్రిలో మందులు లేకపోవడంతో బయట కొనుగోలు చేసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు.

కొరత ఉన్న మందులు

గత కొన్ని నెలలుగా కొన్ని రకాల మందులు అందుబాటులో లేవు. ఫేషియల్ మాస్క్, శానిటైజర్, స్కాన్ జెల్, ఈసీజీ జెల్, సిరంజిన్లు, సెలైన్ ఎక్కించే పైపు సెట్, బ్యాండేజీలు, కార్డన్, యూరిన్ ట్యూబ్స్, డిస్పోజబుల్ బెషిట్స్, బెటాడియన్ సొల్యూషన్, ల్యాబ్ పరీక్షలకు సంబంధించిన ముడిసరుకులు లేవు. ల్యాబ్ పరీక్షల కోసం ఆస్పత్రి వచ్చే ప్రజలు ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. కంటికి సంబంధించిన యాంటీబయోటిక్స్ మాత్రలు అంటే ప్రోఫ్లాక్సిన్, గెటిఫ్లానిక్స్, జెంటామైసిన్, మాక్సీఫ్లాక్సిన్ లేవు. మానసిక జబ్బులకు సంబంధించిన అమిజుట్రీడే -200 ఎంజీ, లిథియం 450 ఎంజీ, క్వటియాపైన్ 25 ఎంజీ, క్లోజాఫైన్ 50 ఎంజీ, క్లోణజపం 0.5 ఎంజీ, లోరాజెపామ్ 2 ఎంజీ మాత్రలు స్టాక్ లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఫిట్స్, అన్ని రకాల బ్లీడింగ్ నివారణకు వాడే మందులు, పలు రకాల యాంటీబయోటిక్స్, హిమోగ్లోబిన్ పెంచేవి, వెంటిలేటర్స్ కిట్స్, ఆక్సిజన్ పైప్లు, హృద్రోగ నివారణ మందుల కొరత ఎక్కువగా ఉంది. క్యాన్సర్ నివారణ మందుల్లో కొన్ని మాత్రమే ఉన్నాయి. కుట్లు వేసే సూదులు, కడుపు నొప్పి, గ్యాస్ట్రిక్, తిమ్మిర్ల నియంత్రణ, రుతుక్రమం లోపాల నియంత్రణ, మలబద్ధకం, గాయాలు మానేందుకు వాడే మందులు, గర్భాశయ ఇన్ఫెక్షన్ల మందుల కొరత కూడా ఉంది. ఈ మాత్రల కోసం ఆస్పత్రి ఎదుట ఉన్న మెడికల్ షాపుల వద్ద క్యూకడుతున్నారు. ఆస్పత్రుల్లో అక్కడి వైద్యులు రాసిన అన్ని మందులు దొరకడం లేదు. గంటల తరబడి క్యూలో ఉన్నా.. కొన్ని మందులు మాత్రమే ఇస్తున్నారు.

పక్కదారి పడుతోందా..?

చాలా రకాల మందులు, మాత్రలు, సెలైన్ బాటిళ్లు, సిరంజిలు ఆస్పత్రుల నుంచి మాయమవుతున్నాయి. ఇష్టానుసారంగా ఎవరికి వారు చేతికందినంత పట్టుకెళ్లిపోతున్నారని ఆస్పత్రిలోని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో తొందరగా స్టాక్ అయిపోతుందనే ఆరోపణలున్నాయి. ఇక ఆస్పత్రుల్లో పనిచేసే చాలా మంది డాక్టర్లు, సిబ్బందికి సొంత క్లినిక్‌లున్నాయి. ఇలా కూడా కొంత వరకు వెళ్లిపోతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. వీటిపై నిఘా పెడితే చాలా పక్కాదారికి అడ్డుకట్ట పడే అవకాశాలున్నాయని ఆస్పత్రి వర్గాలు తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నాయి.



చిత్తూరులోని ఓ ప్రైవేటు మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేస్తున్న జనం

బయటికి రాయిస్తే ఎలా...

"జ్వరం, కీళ్ల నొప్పులు అని జిల్లా ఆస్పత్రికి వెళ్లాను. జ్వరం అధికంగా ఉందని సెలైన్ బాటిళ్లు పెట్టుకోమన్నారు. సెలైన్ బాటిళ్లు పెట్టుకుందామని వెళితే బయట తీసుకోరమన్నారు. రూ.500 ఇచ్చి ఆ బాటిళ్లు బయట కొనుక్కొచ్చాం. ఐదు రకాల మాత్రలు రాయిచ్చారు. అందులో మూడు రకాలు ఇక్కడే ఇచ్చారు. మిగిలిన రెండు రకాల మాత్రలు బయట మెడికల్ షాపులో కొనుక్కున్నాం.



–చిక్కమ్మ, జీడీనెల్లూరు

పేదలకు ఆర్థిక భారం

గతంలో సిరంజిలు బయటకు రాసేవారు. ఇప్పుడు ఆ సిరంజిలు ఇస్తున్నారు. అయితే చాలా రకాలైన మందులు, మాత్రలు లేవని చేతులెత్తేస్తున్నారు. బయటికిపోయి తీసుకోమంటున్నారు. డబ్బులున్న వాళ్లు వెళ్లి బయట షాపుల్లో తీసుకుంటారు. లేని సమయంలో పేదలు ఏం చేస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ ఆస్పత్రినే నమ్ముకుని వచ్చే మాలాంటి వాళ్ల పరిస్థితి ఏంటి. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.



–శ్రీరాములు, గుడిపాల

అద్భుతాలు వద్దు.. అవసరాలు తీర్చండి

- జిల్లాలో ఇన్‌చార్జిల పాలన
- వ్యవసాయ కనెక్షన్ల కోసం రైతుల పాట్లు
- జెడ్పీటీసీ, గ్రీన్‌అంబాసిడర్ల జీతాలు పెండింగ్
- రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించారు. ఎప్పుడూ చూడని మెరుగైన పాలన అందిస్తామని గొప్పలు చెప్పి ప్రజలను నమ్మించారు. అధికారంలో కొచ్చి ఆరునెలలు పూర్తయింది. హామీల విషయం పక్కన పెడితే.. ప్రభుత్వ శాఖలు సమస్యల్లో కూరుకుపోయాయి. సాధారణ సేవలు కూడా ప్రజలకు అందడం లేదు. ప్రభుత్వ శాఖల్లో ఇన్‌చార్జిల పాలన, విద్యుత్ పరికరాలు లేక వ్యవసాయ కనెక్షన్ల కోసం రైతుల పాట్లు, జెడ్పీటీసీలు, గ్రీన్‌అంబాసిడర్ల వేతన బకాయిలు, ప్రభుత్వ ప్రాధాన్య భవనాల ప్రారంభంపై నిర్లక్ష్యం, ప్రభుత్వ శాఖలు, పంచాయతీల విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. అద్భుతాలను సృష్టించవద్దు.. అవసరాలను తీర్చండి చాలంటూ జనం వేడుకుంటున్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో ఇన్‌చార్జిల పాలన

జిల్లాలోని పలు ప్రభుత్వశాఖలు ఇన్‌చార్జిల పాలనతో నెట్టుకొస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో వైఎస్సార్‌సీపీ ముద్రతో కొందరు అధికారులకు స్థానచలనం కల్పించారు. కూటమి నాయకుల సిఫార్సులతో పలువురు అధికారులు బాధ్యతలు స్వీకరించారు. కానీ ముఖ్య శాఖల్లో పోస్టులన్నీ అదనపు బాధ్యతలు, ఇన్‌చార్జిలతో నడిపిస్తున్నారు. తిరుపతి ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా ఉన్న విజయ్‌కుమార్‌కు తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్ఈగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, రిజిస్ట్రేషన్‌శాఖలోని ప్రధాన పోస్టుల్లో ఇన్‌చార్జులను నియమించారు. ఇంకా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి డీఆర్‌డీఏ పీడీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పరిశ్రమలశాఖ జీఎం సెలవుపై వెళ్లడంతో తిరుపతి డీడీకి అదనపు బాధ్యతలు ఇచ్చారు. జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఆఫీసర్ శ్రీనివాస్‌కు అనంతపురం జిల్లా అదనపు బాధ్యతలు ఇచ్చారు. దీంతో జిల్లా మొత్తానికి ఒకే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. వీటితో పాటు తూనికలు కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ సెలవుపై వెళ్లడంతో మరో అధికారికి అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఆర్‌అండ్‌బీలో ఈఈ పరిధిలో మొత్తం 79 పోస్టులకు గాను 18 ఖాళీలు ఉన్నాయి. జిల్లా విద్యుత్‌శాఖలో 10 ఏఈ స్థానాల్లో ఇన్‌చార్జిలే దిక్కుగా మారారు. ఇన్‌చార్జిల పాలన సక్రమంగా ఉండదని కాదు..వారికి పరిపాలన భారంగా మారింది.



జెడ్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన గ్రీన్ అంబాసిడర్లు (ఫైల్)

గ్రీన్‌అంబాసిడర్లు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1977 మంది గ్రీన్‌అంబాసిడర్లు పనిచేస్తున్నారు. వీరు గ్రామాల్లో చెత్తసేకరణ, వర్మికంపోస్టు తయారీ, కాలువలు, ఓవర్‌హెడ్ ట్యాంకుల శుభ్రం, పంచాయతీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో చెత్త తీయడం వంటి పనులు చేస్తున్నారు. వీరికి నెలకు రూ.6 వేలు వేతనం. వీరికి దాదాపు కోటి వరకు బకాయిలు ఇవ్వాల్సి ఉంది.

ప్రారంభానికి నోచుకోని ప్రభుత్వ భవనాలు

గత పాలనలో ప్రాధాన్యత భవనాల కింద సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టారు. కూటమి ప్రభుత్వం రాగానే వివిధ దశల్లో ఆ భవనాలు పనులు నిలిపివేశారు. కొన్ని కార్యాలయాలు పనులు దాదాపు పూర్తయిన వాటిని ప్రారంభించకుండా అలాగే వదిలేశారు. జిల్లాలో సచివాలయాలు 98, ఆర్‌బీకేలు 120, హెల్త్ క్లినిక్‌లు 69 భవనాలు కలిపి మొత్తం 287 కార్యాలయాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

విద్యుత్ బకాయిలు రూ.600 కోట్లు


జిల్లాలో పలు ప్రభుత్వ శాఖలు, పంచాయతీల బకాయిలు రూ.600 కోట్ల వరకు ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్ల బిగింపు పనులు జరుగుతున్నాయి. వీటిని భవిష్యత్‌లో ప్రీపెయిడ్‌గా మార్చనున్నారు. అంటే ముందుగానే డబ్బు చెల్లిస్తేనే కరెంటు వస్తుంది. ఇప్పుడు ఈ వందల కోట్ల ప్రభుత్వ కార్యాలయాల బకాయిల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వీటిని తీర్చకపోతే అది విద్యుత్‌శాఖపై తీరని భారంగా మారనున్నది. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు వాటిని తీర్చడానికి సర్దుబాటు చార్జీల పేరిట మరోసారి కరెంటు బిల్లును పెంచినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు.

వ్యవసాయ కనెక్షన్ల కోసం రైతులపాట్లు

జిల్లాలో వ్యవసాయ సర్వీసులకు డబ్బు చెల్లించిన 2 వేల మంది రైతులు విద్యుత్ పరికరాలు లేక అగచాట్లు పడుతున్నారు. పరికరాలు నిల్వ లేకపోవడంతో జిల్లా స్టోర్స్ ఖాళీగా మారింది. అప్పుడప్పుడు వస్తున్న పరికరాలను వాణిజ్య సర్వీసులకు కేటాయిస్తున్నారు. దీంతో రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్, ఎర్త్‌పైపుల లేక అల్లాడుతున్నారు. స్టోర్స్‌లో ప్రసుత్తం ఉమ్మడి జిల్లాకు కలిపి 100 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే నిల్వ ఉన్నాయి. జిల్లాలో పలు విద్యుత్ అభివృద్ధి పనులు మెటీరియల్స్ లేక సక్రమంగా జరగడం లేదు.



ఐరాలలో ప్రారంభానికి నోచుకోని హెల్త్‌క్లినిక్



విద్యుత్ సర్వీసు ఇవ్వకపోవడంతో పలమనేరులో ఎండిపోయిన పంట

జెడ్పీటీసీల జీతాలు పెండింగ్

ఉమ్మడి జిల్లాలో మొత్తం 65 మంది జెడ్పీటీసీలు ఉన్నారు. వీరికి పలు నెలలుగా జీతాలు చెల్లించాల్సి ఉంది. ఒకరికి నెలకు రూ.6 వేలు గౌరవవేతనం ఇస్తున్నారు. ఇప్పటికి రూ.71 లక్షలు బకాయిలు పడ్డారు. వీటి పై ఇటీవల జరిగిన జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ల పంపిణీ రేపు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 31వ తేదీన పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 2025 జనవరి పింఛన్లను ముందస్తుగా డిసెంబర్ 31న పంపిణీ చేసేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 2,67,240 మందికి రూ.113.49 కోట్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. వంద శాతం పింఛన్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. 31న పింఛన్‌లు అందజేస్తారనే విషయాన్ని పింఛన్‌దారులకు ముందస్తుగా తెలియజేయాలని ఆదేశించామన్నారు. మంగళవారం ఉదయం పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని తెలిపారు. ఎలాంటి తప్పిదాలు చోటు చేసుకోకుండా పింఛన్లను పంపిణీ చేసేలా డీఆర్‌డీఏ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రెండు నెలల్లో వివిధ కారణాలతో పింఛన్ తీసుకోని వారికి ఈ నెలలో 3 నెలల పింఛన్ పంపిణీ చేస్తారన్నారు. నవంబర్ 2024 నెలలో 236 వితంతు పింఛన్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

చౌడేపల్లె: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు పెద్దయల్లకుంట్లకు చెందిన వెంకట్రమణ కుమారుడు టి.సునీల్ కుమార్ (26) పల్సర్ బైక్‌లో చౌడేపల్లెకు సొంత పనుల నిమిత్తం వచ్చాడు. పనులు ముగించుకొని ఇంటికి బయల్దేరాడు. పెట్రోల్ బంక్ సమీపంలో వెళ్తుండగా ఎదురుగా పుంగనూరు నుంచి తిరుపతికు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సునీల్‌కుమార్‌ను 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి


మృతి చెందిన తేజ

బంగారుపాళెం: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై గుళికల మందు తాగిన వివాహిత చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని తూంపాయనపల్లె పంచాయతీ పాపిశెట్టిబావి యానాది కాలనీకి చెందిన రమేష్ భార్య తేజ(30)కుటుంబంలో కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం గొడవ పడ్డారు. దీంతో మనస్థాపం చెంది గుళికల మందు తాగింది. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు తేజను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోస్టు కొట్టు.. లాఠీ పట్టు

- నేటి నుంచి కానిస్టేబుల్ పోస్టులకు దేహదారుఢ్య పరీక్షలు
- వచ్చేనెల 10వ తేదీ వరకు కొనసాగనున్న ఈవెంట్స్
- ఉమ్మడి జిల్లాలో 5,238 మందికి.. చిత్తూరు డీటీసీలోనే పరీక్షలు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్.. ప్రిలిమినరీ పూర్తి

జిల్లాకు పోస్టులు ఇలా..

చిత్తూరు జిల్లా :

కానిస్టేబుల్ పోస్టులు	ఐఆర్ కానిస్టేబుల్
240	630

ఐఆర్ బెటాలియన్ కానిస్టేబుల్ 630 ఖాళీలు

తిరుపతి జిల్లా : కానిస్టేబుల్ పోస్టులు 110

చిత్తూరు అర్బన్: ప్రభుత్వ ఉద్యోగాలంటే ఎప్పుడూ క్రేజ్. అందులోనూ పోలీస్ శాఖలో ఖాకీ డ్రెస్ వేసుకోవడానికి యువత తహతహలాడుతుంటారు. రెండేళ్ల క్రితం నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పోలీస్ కానిస్టేబుల్, ఎస్‌ఐ పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ ఇవ్వడం, ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించడం తెలిసిందే. కానిస్టేబుల్ పోస్టుల రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం నుంచి దేహదారుఢ్య పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం జిల్లా పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది.

ఖాకీ చొక్కా వేసుకోవాలనే యువత కల సాకారం కావడానికి కీలక సమయం ఆసన్నమైంది. ఉమ్మడి జిల్లాలో కానిస్టేబుల్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో ఇప్పటికే ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు చిత్తూరు నగరంలోని ప్రశాంత్ నగర్‌లో ఉన్న జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. చిత్తూరు, తిరుపతి, మదనపల్లె (ఉమ్మడి చిత్తూరు జిల్లా) ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు చిత్తూరులోనే ఈ పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుంది. జనవరి 10వ తేదీ వరకు ఈవెంట్స్ నిర్వహిస్తారు. 2022లో అప్పటి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి, ప్రిలిమినరీ పరీక్షలు సైతం నిర్వహించింది. తరువాత రాష్ట్రంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, కొందరు హోంగార్డులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం, సార్వత్రిక ఎన్నికలు రావడంతో తదుపరి పరీక్షలు వాయిదా పడుతూ వచ్చాయి. తాజాగా రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఈవెంట్స్ నిర్వహించడానికి పచ్చజెండా ఊపడంతో త్వరలోనే పోస్టులు భర్తీ చేయనున్నారు.

పరీక్షలివే..



- వంద మార్కులకు దేహదారుఢ్య పరీక్షలు ఉంటాయి.
- ఇందులో 100 మీటర్ల పరుగు పందెంకు 30 మార్కులు
- లాంగ్ జంప్ 30 మార్కులు
- 1600 మీటర్ల పరుగుకు 40 మార్కులు ఉంటాయి.
- సివిల్ పోస్టులకు 1600 మీ. పరుగులో తప్పనిసరిగా అర్హత సాధించాలి. 100 మీ. పరుగు లేదా లాంగ్ జంప్ ఏదో ఒక దాంట్లో అర్హత సాధించాలి. ఇక్కడ వచ్చిన మార్కులను తుది పరీక్షలకు ప్రామాణికంగా తీసుకోరు.
- ఏపీఎస్పీ పోస్టులకు మూడు ఈవెంట్లలోనూ తప్పనిసరిగా అర్హత సాధించాలి. ఇక్కడ వచ్చిన మెరిట్ మార్కులను తుది రాత పరీక్షల్లో పరిగణనలోకి తీసుకుంటారు.
- దేహదారుఢ్య పరీక్షల్లో అర్హత సాధించిన వారికి తుది పరీక్షలకు ఎంపిక చేస్తారు.
- తుది పరీక్షల్లో 200 మార్కులకు ఆబ్జెక్టివ్ రూపంలో ప్రశ్నలు ఉంటాయి. అత్యధిక మార్కులు వస్తే ఉద్యోగంకు ఎంపికవుతారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

ఇవి తప్పనిసరి

- ఈవెంట్స్ జరిగే మైదానంలోని అభ్యర్థి ఒక్కరికే అనుమతి ఉంటుంది. స్పైక్ షూ (బూట్ల కింద స్క్రూలు ఉండేవి) వేసుకుని పరుగెత్తడానికి అనుమతి లేదు. మొబైల్ ఫోన్స్ అనుమతించరు.
- ఉదయం 5 గంటలకు పరీక్షలు జరిగే మైదానం వద్ద ఉండాలి.
- కాల్ లెటర్‌లో సూచించిన స్కోర్ కార్డు, స్టేజ్ 1- స్టేజ్ 2 అప్లికేషన్ తప్పనిసరిగా తీసుకురావాలి.
- ఎస్ఎస్‌సీ, ఇంటర్, తాజా కుల ధృవీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్లు, క్రీడల సర్టిఫికెట్లు ఒరిజినల్స్ తీసుకురావాలి. అన్ని సర్టిఫికెట్లు రెండు జతల జిరాక్స్.. వాటిపై గెజిటెడ్ అధికారి సంతకాలు ఉండాలి. మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తేవాలి.
- పరీక్షకు హాజరయ్యే ప్రతి అభ్యర్థి చేతి వేలిముద్రనూ బయోమెట్రిక్ ద్వారా తీసుకుంటారు. చేతులకు రంగులు, గోరింటాకు పెట్టుకో కూడదు.
- ఒక్కసారి ఈవెంట్స్ ప్రారంభిస్తే.. అన్నీ పూర్తయ్యాక మైదానం నుంచి వెలుపలకు పంపిస్తారు.
- గుండె ఆరోగ్య పరిస్థితి, బీపీ పరీక్షించుకుని ఈవెంట్స్‌కు రావడం ఉత్తమం.

పారదర్శకంగా ఎంపిక..

“రన్నింగ్‌లో హెల్ప్ చేస్తా, ఉద్యోగం ఇప్పిస్తా, నేను చెప్పినంత ఇవ్వు.. అని ఎవరు చెప్పినా నమ్మకండి. ఎంపిక ప్రక్రియ మొత్తం పారదర్శకంగా జరుగుతుంది. ప్రతి చోట సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈవెంట్స్ నిర్వహిస్తాం. మధ్యవర్తి, దళారీ అనే మాటే ఉండదు. ప్రతిభ ఆధారంగానే అభ్యర్థులు అర్హత సాధిస్తారు. ఎవరైనా అభ్యర్థుల్ని నమ్మబలికించే ప్రయత్నం చేస్తే డయల్-121, పోలీసు వాట్సప్ నంబర్ 9440900005కు సమాచార మివ్వండి.

– మణికంఠ చందోలు, ఎస్పీ, చిత్తూరు

బైక్‌లు ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన అంజి, చందు

వి.కోట: రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం సాయంత్రం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు, మండలంలోని ముదరందొడ్డికి చెందిన జయచంద్ర కుమారుడు ఆంజి తన బైక్‌పై వి.కోట నుంచి పలమనేరు వైపు బయల్దేరాడు. అదే సమయంలో మండలంలోని మద్దిరాళ్ల గ్రామానికి చెందిన మురళి కుమారుడు చందు తన బైక్‌పై ఎదురుగా వస్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని ఖాజీపేట వద్ద పాలడెయిరీ ఎదురుగా ఆ రెండు బైక్‌లు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు హుటాహుటిన స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కుప్పం పీఈఎస్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

డీజే టిల్లూ ‘కొట్టూ కొట్టూ...’

- బస్సులో వీడియో రాలేదని డ్రైవర్‌తో వాగ్వాదం
- ప్రయాణికులపై దాడికి దిగిన డ్రైవర్
- పలమనేరుకు చేరిన ఓంశక్తి భక్తుల పంచాయితీ


ప్రైవేటు బస్సు డ్రైవర్, ప్రయాణికుల మధ్య గొడవ

పలమనేరు: ఓంశక్తి మాల ధరించి అమ్మవారి దర్శనానికి వెళ్లిన భక్తులకు డీజే టిల్లూ డ్యాన్సు చుక్కలు చూపించిన సంఘటన ఆదివారం పలమనేరులో వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని చౌడేపల్లి మండలం పుదిపట్ల పంచాయతీ మిట్టూరుకు చెందిన 34 మంది ఓంశక్తి భక్తులు ప్రైవేటు బస్సును రూ.1.25లక్షలకు మాట్లాడుకొని ఆలయాల సందర్శనకు ఈనెల 22న బయల్దేరారు. బస్సు అద్దెకు చెల్లించిన మొత్తం పోగా మిగిలిన పదివేలను స్వగ్రామంలో బస్సు దిగినాక ఇస్తామని తెలిపారు. ఈ టూరిస్ట్ బస్సు తమిళనాడు, కర్ణాటకలోని పలు దేవాలయాల సందర్శనానంతరం బయలుదేరింది. ఈ నేపథ్యంలో బాగేపల్లి వద్ద డ్రైవర్ అరవింద్ డీజిల్‌కు డబ్బులిస్తేనే బస్సు కదులుతుందని ఆపేశాడు. దీంతో ప్రయాణికులు, డ్రైవర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనిపై ఆగ్రహించిన బస్సు డ్రైవర్ మహిళలపై దాడికి దిగాడు. తనకు డబ్బులు మొత్తం ఇస్తేనే బస్సు కదులుతుందని తెగేసి చెప్పారు. వారు ఇవ్వకపోవడంతో కర్ణాటకలోని ధర్మస్థలం వద్ద ప్రయాణికులను బస్సులోంచి దింపేశాడు. దీంతో పిల్లాపాపలతో వారంతా రాత్రిపూట రోడ్డుపై పడుకోవాల్సి వచ్చింది. ఆపై అందరూ కలిసి డబ్బులు సమకూర్చుకుని అదే బస్సులో ప్రయాణం మొదలు పెట్టారు. మార్గమధ్యంలో బస్సులోని వారు డీజే టిల్లు వీడియో సాంగ్ పెట్టాలని డిమాండ్ చేశారు. అయితే బస్సులో వీడియో పనిచేయడం లేదని డ్రైవర్ చెప్పాడు. అప్పుడేమో అన్నీ ఉన్నాయని చెప్పి ఇప్పుడు ఇలా చేస్తే ఎలా అని మళ్లీ డ్రైవర్‌తో ప్రయాణికులతో గొడవ మొదలైంది. ఈ నేపథ్యంలో బస్సులోని కొందరు యువకులు డీజే టిల్లు డ్యాన్స్‌లు మొదలు పెట్టారు. దీంతో డ్రైవర్ బస్సును పలమనేరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఆపేసి తమ యజమానికి ఫోన్ చేశాడు. అక్కడికి చేరుకున్న యజమాని, డ్రైవర్లు స్థానిక యూనియన్ నాయకులతో కలసి సమస్యను పరిష్కరించారు. బస్సు గ్రామానికి వెళ్లిన తరువాత మిగిలిన అద్దె ఇచ్చేలా నిర్ణయించారు. దీంతో ఓంశక్తి భక్తులు ఊరు చేరుకున్నారు.


బస్సులోంచి ప్రయాణికులను దింపేసిన దృశ్యం

ఈ రైళ్లు.. రెండు నెలలు రద్దు

- తిరుపతి -కాట్పాడి ప్యాసింజర్లు మళ్లింపు
- కుంభమేళా సాకుతో మెము రైళ్ల రద్దు
- ఈ మార్గం మూడు జిల్లావాసులకు అనుకూలం
- పట్టించుకోని చిత్తూరు ఎంపీ


తిరుపతి-కాట్పాడి ప్యాసింజర్ రైలు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు మీదుగా వెళ్లే తిరుపతి-కాట్పాడి ప్యాసింజర్ రైళ్లను రెండు నెలలపాటు రద్దు చేశారు. రాబోయే కుంభమేళా-2025 నేపథ్యంలో మళ్లించారు. పేదవాడి కోసం ఉన్నదే ఒక రైలు, దానిని కూడా రద్దు చేశారు. రైల్వేబోర్డు నిర్ణయంపై ప్రయాణికుల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశంలో మరెక్కడా రైళ్లు లేనట్టు జిల్లాలో పరుగులు తీసే రైళ్లను కుంభమేళా-2025కు మళ్లించేశారు. తిరుపతి-కాట్పాడి మధ్య నడిచే మెము రైళ్లను రద్దు చేస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసింది. అడిగే నాథుడు లేన్నట్లుగా రైల్వే ఉన్నతాధికారులు గుంతకల్ డివిజన్ పరిధిలో తీసుకుంటున్న నిర్ణయాలు పరోక్షంగా కేంద్ర ప్రభుత్వంపై వ్యతిరేకతను పెంచుతున్నాయి.

ఈ మార్గంలో మూడు జిల్లాల వాసుల ప్రయాణం

తిరుపతి-కాట్పాడి, కాట్పాడి-తిరుపతి రైళ్లు (07661, 07662, 07581, 07660, 07659, 07582) రోజూ మూడు రైళ్లు.. 6 ట్రిప్పులు నడుస్తున్నాయి. తక్కువ ధరతో గమ్యం చేరడానికి పేదవర్గాలకు ఈ రైలు అనుకూలంగా ఉంది. కాట్పాడి మీదుగా బొమ్మసముద్రం, రామాపురం, సిద్ధంపల్లె, చిత్తూరు, పూతలపట్టు, పాకాల, పనపాకం, ముంగిలిపట్టు, చంద్రగిరి మీదుగా 10 స్టాప్‌ల తర్వాత తిరుపతికి చేరుకుంటుంది. ఒక రైలులో మొత్తం 8 బోగీలు ఉండగా దాదాపు బోగీలో 100 మంది వరకు ప్రయాణికులు ఎక్కుతారు. ఆ లెక్కన ఒక ట్రిప్‌కు 800 మంది, రోజు దాదాపు 5 వేల మంది ప్రయాణం చేస్తున్నారు. ఈ రైళ్లను రద్దు చేయడంతో ఉద్యోగులు, అధికారులు, విద్యార్థులు, వ్యాపారులు, రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చిత్తూరుకు తమిళనాడు ప్రాంతం సరిహద్దు కావడంతో అధికంగా రాకపోకలు సాగిస్తుంటారు. వేలూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల వాసులు వ్యాపార, విద్య, పలు పనులకు తిరుపతి-కాట్పాడికి వస్తూ పోతుంటారు. తమిళనాడువాసులు తిరుపతికి చేరుకుని ప్యాసింజర్ రైళ్ల ద్వారా చేరుకునే వారు. వీరే కాకుండా కాట్పాడి-తిరుపతికి మార్గంలో మొత్తం 10 స్టాపింగ్స్‌లో వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. విద్య, వైద్య, ఉద్యోగం, వ్యాపారంతో రోజూ 5 వేల మందికి పైగా ప్రయాణిస్తున్నారు.

రెండు నెలలు రద్దు

కుంభమేళా-2025 కోసం రెండునెలల పాటు తిరుపతి-కాట్పాడి ప్యాసింజర్ మార్గంలో నడిచే 3 రైళ్లను రద్దు చేశారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల మీదుగా ఉండే రైలు మార్గంలో నడిచే ప్యాసింజర్ రైళ్లపై ఆధారపడి ప్రయాణించే వేలాదిమంది పేదలకు రైలు సౌకర్యం దూరం చేశారు. ఏకంగా మూడు రైళ్లను రద్దు చేసి ప్రయాణికుల ఇబ్బందులను రైల్వే బోర్డు పరిగణనలోకి తీసుకోలేదన్న అపవాదును మూటకట్టుకుంది. కుంభమేళాకు రైళ్ల కేటాయించాలని కోరితే రాయలసీమలో వెళ్లే రైళ్లను కేటాయించడంపై చిత్తూరు ఎంపీ స్పందించాల్సి ఉంది. వీటితో పాటు తిరుపతి-రామేశ్వరం, హౌరా-పాండిచ్చేరి, ఓకా-రామేశ్వరం, తిరుపతి-రామేశ్వరం, టాటా-యశ్వంత్‌పూర్, కన్యాకుమారి, హటియా-యశ్వంత్‌పూర్, హౌరా-పాండిచ్చేరి రైళ్లు చిత్తూరుమీదుగా వెళ్తున్నప్పటికీ ఇక్కడ స్టాపింగ్స్ లేవు. ఈ రైలులో ప్రయాణించాలంటే పాకాల లేదా తిరుపతికి వెళ్లి ఎక్కాల్సిందే. వేలూరు నుంచి చెన్నైకు వెళ్లే రైలును చిత్తూరు నుంచి ఎక్కే సౌకర్యం కల్పించాలి.

ప్రత్యామ్నాయం లేకపోతే ఎలా ?



“కుంభమేళాకు రెండు నెలలు రైళ్లు పంపారు. కానీ ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయకపోవడం దారుణం. ఈ రైళ్లను నమ్ముకొని రోజు వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఇలా అకస్మాతుగా నిర్ణయం తీసుకోవడం సరికాదు.

– సురేంద్రన్, జిల్లా కమిటీ సభ్యులు, సీపీఎం

పేదలంటే అంతా నిర్లక్ష్యమా!



ప్యాసింజర్ రైళ్లను ఎటువంటి సమాచారం లేకుండా రద్దు చేశారు. ఈ మార్గంలో మూడు జిల్లాలవాసులు తక్కువ ఖర్చుతో ప్రయాణం చేసేవారు. ఉన్నపలంగా వాటిని ఆపివేశారు. పేదలంటే చిన్నచూపు కాబట్టే ఇలా వ్యవహరిస్తున్నారు.

– సందీప్, చిత్తూరు

ప్రమాదాలు పై‘పైకి’..!



- ఆందోళన కలిగిస్తున్న రోడ్డు ప్రమాదాలు
- గతేడాదితో పోలిస్తే ప్రధాన నేరాలు తగ్గుముఖం
- పెరిగిన హత్యాయత్నాలు.. చోరీలు, దోపిడీలు
- నేరస్తులను పట్టుకోవడంలో ఎప్పుడూ ముందడుగు
- పోలీసు వార్షిక పనితీరుపై చిత్తూరు ఎస్పీ మణికంఠ

పెరిగిన నేరాలు ఇలా..

నేరం	2023	2024
రోడ్డు ప్రమాదాలు	703	734
మృతులు	351	389
హత్యాయత్నాలు	55	67
పగటి పూట చోరీలు	31	39
దోపిడీలు	1	3
దోచుకోవడం	0	8

తగ్గిన నేరాలు ఇలా..

నేరం	2023	2024
హత్యలు	44	24
అత్యాచారాలు	44	39
అపహరణ	25	21
చోరీలు	124	88
మోసాలు	197	140
సైబర్ నేరాలు	58	41

చిత్తూరు అర్బన్: ప్రతి ఏటా డిసెంబరు నెలాఖరున ఓ ఏడాది కరుమరుగవడం.. మరో కొత్త ఏడాది పురుడుపోసుకోవడం జరుగుతూనే ఉంది. కానీ మారుతున్న ప్రతి ఏటా జిల్లాలో నేరాల నియంత్రణ, కొత్త తరహా నేరాలతో నిందితులు, పోలీసులకు సవాళ్లు విసురుతూనే ఉన్నారు. మరోవైపు మానవ తప్పిదాలతో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు మనిషి ప్రాణాలకు విలువ లేకుండా చేస్తోంది. 2024లో జిల్లా పోలీసుశాఖ పనితీరుపై అధికారులు చెబుతున్న గణాంకాల్లో కొన్ని పర్వాలేదనిపిస్తుంటే.. మరికొన్ని ఆందోళన కలిగిస్తున్నాయి. పోలీసులతో పాటు ప్రజలు కూడా మేల్కోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. ఆదివారం చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు 2024లో పోలీసుశాఖ పనితీరు, జిల్లాలో చోటు చేసుకున్న నేర ఘటనల వివరాలను మీడియాకు వెల్లడించారు.

సైబర్ సవాళ్లు..!

మరోవైపు సాంకేతిక పరిజ్ఞానం పెరిగేకొద్దీ సైబర్ నేరగాళ్లు సరికొత్త సవాళ్లను విసురుతూ ప్రజల్ని దోచుకుంటున్నారు. ఇదే కోవలో డిజిటల్ అరెస్టులు, పోస్టుకార్డు స్కానర్లనే కొత్త తరహా సైబర్ నేరాలు ఈ ఏడాది పరిచయమయ్యాయి. ఈడీ, సీబీఐ, జడ్జిల పేరిట ఓ సెటప్‌చేసి.. వీడియోకాల్ చేయడం, లేనిపోని నేరాభియోగాలు మోపి ఖాతాలో ఉన్నకాడికి దోచుకోవడమే డిజిటల్ అరెస్టులు. జిల్లాలో ఈ తరహా కేసులు ఆరు నమోదయ్యాయి. సుమారు రూ.80 లక్షల వరకు నగదును దోచుకున్నారు. ఇక పోలీస్ అంటేనే గుర్తుకొచ్చే డయల్-100కు ఈ ఏడాది 11,559 కాల్స్ వచ్చాయి. సగటున 15-17 నిమిషాల వ్యవధిలో పోలీసులు స్పందించారు. ఈ సారి డయల్ -100 స్థానంలో 121 నెంబర్ వచ్చింది.


సంతృప్తికరం..



“ఈ ఏడాది పోలీసు పనితీరు సంతృప్తికరంగా ఉంది. 15 రకాల నేరాలు బాగా తగ్గాయి. ఏడు రకాల నేరాల్లో స్వల్ప పెరుగుదల ఉంది. రోడ్డు ప్రమాదాల పెరుగుదలకు మానవ తప్పిదాలే ఎక్కువగా ఉన్నాయి. సెప్టెంబరులో మొగిలి ఘాట్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం ఊహించనిది. గుడిపాలలో చోటుచేసుకున్న ఏటీఎం దోపిడీ కేసును ఛేదించినందుకు డీజీపీ నుంచి అవార్డ్ ఫర్ బెస్ట్ క్రైమ్ డిటెక్టివ్ (ఏబీసీడీ) రాష్ట్ర స్థాయి అవార్డు చిత్తూరుకు వచ్చింది. కొత్త ఏడాదిలో మరిన్ని లక్ష్యాలతో ముందుకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. ఆర్గనైజింగ్ క్రైమ్ తగ్గించడం, మాదకద్రవ్యాల నిర్మూలనపై ఎక్కువగా ఫోకస్ పెడుతున్నాం. అదే సమయంలో పోలీసు సంక్షేమాన్ని విస్మరించలేదు.

– మణికంఠ, ఎస్పీ, చిత్తూరు

కలప ట్రాక్టర్లు సీజ్


అటవీ శాఖాధికారులు సీజ్ చేసిన కలప ట్రాక్టర్లు

కుప్పం: కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న కలపను ట్రాక్టర్లతో సహా అటవీ శాఖాధికారులు సీజ్ చేశారు. కర్ణాటక సరిహద్దులోని కెంపాపురంలో ఆరు ట్రాక్టర్లలో కలపను అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం అందుకున్న అటవీ శాఖాధికారులు దాడులు చేశారు. శాంతిపురం, గుడుపల్లె మండలాల్లోని టీడీపీ నేతలకు సంబంధించిన రెండు ట్రాక్టర్లలో నీలగిరి చెట్లను నరికి తరలిస్తున్నారు. వీరితోపాటు టీడీపీ కార్యాలయంలో పనిచేసే నాయకుడికి చెందిన ట్రాక్టర్లు కూడా ఉన్నట్లు సమాచారం. ఆరు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు అటవీ శాఖాధికారులు తెలిపారు.

కిక్కిరిసిన బోయకొండ

చౌడేపల్లె : పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయంలో క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. పోలీసులు ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

రూ.8.40 లక్షల ఆదాయం

ఆలయంలో విక్రయించిన వివిధ సేవా టికెట్ల ద్వారా రూ.8.40 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. ఆదివారం ఒక్కరోజు మాత్రమే సేవా, ప్రసాదాల టికెట్ల ద్వారా మొత్తం ఆదాయం వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు.